ఘనంగా రాఖీ పౌర్ణమి

నవతెలంగాణ- బాలానగర్

బాలానగర్ మండల కేంద్రంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయాన్నే దేవాలయాలు భక్తులతో కిటకిటలాయి.వివిధ గ్రామాల నుంచి అన్నా తమ్ముళ్లు అక్కాచెల్లులు కుటుంబ సమేతంగా కలుసుకోవడానికి రాఖీ పౌర్ణమి ఒక నిదర్శనం హైదరాబాద్. మహబూబ్‌నగర్ ఇతర పట్టణాలలో ఉన్న తమ సొంత గ్రామాలకు వచ్చి రాఖీ పౌర్ణమి ఘనంగా నిర్వహించుకున్నారు.



సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళా రెడ్డి

నవతెలంగాణ- బాలానగర్

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకువరమని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాజాపూర్ మండలం రంగారెడ్డి గూడ గ్రామానికి చెందిన కె.సతీష్ తండ్రి యాదగిరికి సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన 54 వేల రూపాయల చెక్కును ఆమె అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సునీత శ్రీనివాస్ నాయక్, రాములు గౌడ్, నర్సింలు, లక్ష్మీనారాయణ గౌడ్, సాయి, గొల్ల లక్ష్మీనారాయణ, సంజీవ, అనంతయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

ప్రజావాణి కి వచ్చే ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదులలో భూములకు సంబంధించిన అంశాలు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, వ్యక్తిగత విషయాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు వారు తెలిపారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షిస్తూ భూములకు సంబంధించిన విషయాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున తహసీల్దారులు ప్రత్యేకించి ఈ అంశంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే పిటిషన్ల పై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి?ఎన్ని పరిష్కారింప బడ్డాయి? ఇంకాఎన్ని పెండింగ్ లో ఉన్నాయో? నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి విభాగాన్ని ఆమె ఆదేశించారు.ఫిర్యాదులు తక్కువగా ఉన్న శాఖలు వెంటనే పరిష్కారం చేయాలన్నారు. అలాగే ఇతర శాఖల అధికారులు సైతం వారి పరిధిలో పెండింగ్ లో ఉన్న వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 38 మంది పిర్యాదుదారులు వారి ఫిర్యాదులను సమర్పించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు,డీఆర్ఓ కేవీవీ రవికుమార్,డీఆర్డీఓ నరసింహులు, జిల్లా అధికారులు హాజరయ్యారు.

ఎస్సీమహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో మంచినీటి సమస్య పరిష్కరించాలి : కేవీపీఎస్



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

పట్టణంలోని పిల్లలమర్రి దగ్గర ఉన్న ఎస్సీ మహిళ గురుకుల డిగ్రీ కాలేజీలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు,ఎం మాణిక్యం రాజు, ఎం కురుమయ్య, ఎస్సీ,ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మనిటరింగ్ కమిటీ మెంబర్ బాలయ్య మాట్లాడుతూ ఎస్సీ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో గత 10 రోజుల నుంచి నీళ్ల లేక ఇబ్బందులు గురి అవుతారని తెలిపారు.స్నానాలు చేయడానికి, బాత్రూంలకు, బట్టలు ఉత్తుకోవడానికి, నీళ్ల లేక ప్రిన్సిపల్ దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిష్కరించకుండా, విద్యార్థులు బెదిరిస్తూన్నారని తెలిపారు. భయభ్రాంతులకు గురిచేస్తుంది,అలాంటి ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఇపుడే సమస్యల నా దృష్టికి వచ్చిందని చేప్పారు. అక్కడ ఉన్న మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి సమస్య పరిష్కరించమని చెప్పినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ప్రభుత్వ పాఠశాల

- లోపించిన పారిశుద్ధ్యం



నవతెలంగాణ-హన్వాడ

మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పురాతన భవనము శిథిలావస్థకు చేరింది ఇప్పటికే పాఠశాలలో పై పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నాయి క్లాస్‌రూమ్ లోకి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు అంతే కాకుండా వర్షాలు పడితే నీరు మొత్తం గోడల పై కారుతున్నాయని విద్యార్థులు తెలిపారు. పాఠశాల పైకాపు నీటితో నిండి కారుతున్నాయి. దీంతో విద్యార్థులకు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయంతో ఉన్నారన్నారు.నిరుపయోగంగా ఉన్న తరగతి గదులలో విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు.విద్యార్థులు వాటి వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని కూల్చివేసి కొత్తగా పాఠశాల తరగతి గదులను నిర్మాణాలు చేపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు చెట్లు చెదారంతో నిండి ఉన్నాయి చెట్ల మధ్యలో విషసర్పాలు ఉంటున్నాయన్నారు.విద్యార్థులు ఆట పాటల సందర్భంలో కనిపించడం వల్ల విద్యార్థులు భయభ్రాంతులకు గురవు తున్నారు.వెంటనే అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న తరగతి గదులను కూల్చి వేయాలని తెలిపారు.పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు..

- శాశ్వత పరిష్కరం చూపాలి : గ్రామస్తులు

నవతెలంగాణ - గండీడ్

మిషన్ భగీరథ అధికారుల అలసత్వం,ఎన్ హెచ్ 167 ఎన్ కాంట్రాకటర్ల నిర్లక్ష్యం,కారణంగా మండలం లోని రెడ్డిపల్లి గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రెండు రోజులుగా రావడం లేదు.గ్రామంలో ప్రజలు తాగునీటికీ ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు.గ్రామంలో గ్రామ పంచాయతీ బోరు విద్యుత్ ఉపకేంద్రం పక్కన ఉండడంతో రోడ్డు పనులవల్ల పైప్ లైన్ పగిలిపోవడంతో రోడ్డు వారు బాగు చేయాలా మిషన్ భగీరథ వాళ్ళు బాగు చేయాలా అనే విధంగా పైప్ లైన్ సరి చేయకపోవడంతో బోరు వాటర్ ట్యాంకు రావడం లేదు.దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి ట్యాంకర్ తో గ్రామంలో సప్లై చేస్తున్నారు.కనీస అవసరాలకు,కూడా చుక్క నీళు రావడం లేదు కనీసం తాగడానికి కూడా నీళ్ల లేవని వాపోతున్నారు.ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ కి ఫోన్ చేయగా స్పందించలేదు.



విలీనమా..సయోధ్యనా ?

- కాంగ్రెస్ సవాల్‌కు బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు ఉక్కిరి
- ఉనికిని కోల్పోతున్న తెలంగాణ ఉద్యమ పార్టీ
- చతికిల బడ్డ బీజేపీ
- వరుస హామీల అమలుతో పరుగులు పెడుతున్న కాంగ్రెస్

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తు దయనీయంగా మారింది. జిల్లా నుంచి ఓ ప్రకటన చేయడానికి కూడా సాహసం చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ వైఫల్యాలు అనేకం.వాటిని ఎండగట్టడంలోనూ... నాయకులు కార్యకర్తలు ముందుకు రావడం లేదు.దీంతో పార్టీ శ్రేణులు, నాయకుల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పలువురు చేప్తాన్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఒకే సారి రూ.2లక్షల రుణమాఫీ చేసింది. మూడు దశలలో ఇది పూర్తయ్యింది. అయితే ఉమ్మడి జిల్లాలో ఇంకా 10 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదన్న విమర్శలున్నాయి. రైతుల పక్షాన మాట్లాడటానికి సైతం సాహసం చేయడం లేదు. పశ్చిమ బెంగాల్ వైద్యవిద్యార్థిపై అత్యాచారం హత్య చేసిన ఘటన తెలంగాణ రాష్ట్రాన్ని కుదిపేసినా... ఈ జిల్లా నాయకులు కనీసం ఖండించడం లేదు. ఇక సాగు నీటి విషయంలో లిప్తలున్నా.. కాల్వల నిర్వహణ లేక రిజర్వాయర్లు నిండటం లేదని రైతులు తెలిపారు. దీంతో వచ్చే రబీ సీజన్‌కు సాగునీరందే అవకాశాల్లేవు. సాగునీటి విషయంలో ప్రతి పక్షపాత్ర పోషించే బీఆర్ఎస్ రైతుల గురించి మాట్లాడక పోవడం విచిత్రంగా ఉంది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ రెండు ఎమ్మెల్యేలుగా ఒకసారి మంత్రులుగా పనిచేశారు.అధికారం కోల్పోగానే జిల్లా ప్రజల గురించి మాట్లాడటం మరిచిపోయారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడినా.. శ్రీనివాస్‌గౌడ్ మాత్రం హైదరాబాద్‌కే పరిమితమైయ్యారు.అధికారంలో ఉంటేనే సేవ చేయడం పదవి పోగానే హైదరాబాద్‌కు పరిమితం కావడం చూస్తుంటే వీరికి ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఎంతో మనకు అర్థమౌతోంది.బీజేపీ సైతం ఎన్నికల తర్వాత ప్రజాసమస్యలను గాలికి వదిలిపెట్టింది. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చెప్పిన మాటలకు ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయింది. ఇక నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీ చేసి ఓడిన భరత్‌కుమార్ యాడ ఉన్నాడో తెలియదు.ఎన్నికలకు ముందు చేసిన ప్రకటనలు వాగ్ధానాలు



ఎప్పటికీ ప్రజలు మరువరు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈజిల్లాకు ఎటువంటి అభివృద్ధి పనులు చేస్తుందో చెప్పాలి. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకొని ప్రజలకు దూరంగా ఉంటూ.. విలీనం పనుల్లో తీరిక లేకుండా ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. మొన్న జరిగిన శాసన సభ ఎన్నికల్లో 12 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.అలంపూర్, గద్వాల నియోజక వర్గాలలో మాత్రమే బీఆర్ఎస్ గెలిచింది. అయితే వీరు కూడా తర్వాత కాలంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు వార్తలు వచ్చాయి. జిల్లాలో జరుగుతున్న

బీజేపీతో దోస్తీ ?

ఉమ్మడి జిల్లాలో బీజేపీతో బీఆర్ఎస్ రాజీ దోరణితో ముందుకు వెళ్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో మాత్రమే గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్.మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి కనీసం పోటీ ఇవ్వకపోవడం విచిత్రంగా ఉంది. బీఆర్ఎస్ ఓట్ల మొత్తం గంప గుత్తగా బీజేపీ వైపు మళ్లించారు. దీంతో ఎంపీ ఎన్నికల నాటి నుంచి బీఆర్ఎస్ పతనం మొదలయ్యింది. చివరికి బీఆర్ఎస్‌లో విలీనమా లేక సయోధ్యనా అన్నట్టు ఉంది.

తెలంగాణ రాష్ట్రం కోసం అనేక పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ పరిస్థితి నేడు కుడితిలో పడ్డ ఎలుకలాగా తయారయ్యింది.అధికార కాంగ్రెస్ విమర్శలను ఎదురుకోలేక ఉక్కిరి బిక్కిరవుతోన్నది. త్వరలోనే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందనే వాదనలకు బలం చేకూరే విధంగా ఇక్కడ బీఆర్ఎస్ శ్రేణులు వ్యవహరిస్తున్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందన్న విమర్శలకు బీజేపీ సైతం వివరణ ఇవ్వడం లేదు. డీకే అరుణ ఎంపీగా ఉండి అనేక సార్లు మీడియా ముందు మాట్లాడినా... బీఆర్ఎస్ విలీనం విషయం ప్రస్తావించక పోవడం మరో ఉదాహరణ. ఇక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొకటి అమలు చేస్తూ... ప్రతిపక్షాల నోటి తాళం వేసే విధంగా కాంగ్రెస్ జిల్లాలో దూకుడుగా ఉంది.

రాజకీయ పరిణామల పట్ల నాయకులు స్పందించకపోవడంతో విలీనమా విజృంబనమా అన్న అనుమానాలు వస్తున్నాయన్నాయి.



సంక్షేమ హాస్టల్ తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

నవతెలంగాణ- మహబూబ్‌నగర్

జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ హాస్టల్స్ సంక్షేమ ఆస్తులు తనిఖీ చేసి ఉన్న సౌకర్యాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారుల తో సమీక్ష నిర్వహించారు. ఈ వారం చివరి వరకు పాఠశాల విద్యార్థుల రెండవ జత యూనిఫామ్ ను ఎంఈఓ లకు అప్పగించాలని తెలిపారు.మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో తహసీల్దారులు, ఎంపీడీవోలు రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ళు తనిఖీ చేసిన అనంతరం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గ్రామాలు,మున్సిపాలిటీలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.ఫాగింగ్ నిరంతరం నిర్వహించాలన్నారు.ఇప్పటివరకు ప్రజావాణి కార్యక్రమం ద్వారా పరిష్కరించిన దరఖాస్తులు, అలాగే పెండింగ్ ఉన్న వాటిపై తక్షణం నివేదిక సమర్పించాలని కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి విభాగాన్నిఆమె ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి పిటిషన్లన్నింటిని తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు ఇవ్వాల్సిన రెండో జత యూనిఫామ్ ను వారం వరకు పూర్తిచేసి ఎంఈఓ లకు అప్పగించాలని చెప్పారు. ఎంపీడీవోలు, మండలాల ప్రత్యేక అధికారులు పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ విషయాన్ని పర్యవేక్షించాలన్నారు. మహిళా శక్తి పథకం కింద యూనిట్లపై ప్రత్యేక



అధికారులు బ్యాంకర్ల ద్వారా పరిస్థితిని తెలుసుకొని ఏపిఎంలు, సీసీలతో త్వరగా గ్రౌండ్ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా ఎంపీడీవోలు ,తహసిల్దారులు, ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఒక్కో బృందం ద్వారా గ్రామంలోని అన్ని సంస్థలను పరిశీలించాలని చెప్పారు. అలాగే ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు ఉన్నది లేనిది పరిశీలించాలని, పారిశుధ్య కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలలో బహిరంగ ప్లాట్స్ లో చెత్త ,చెదారం పేరుకు పోకుండా తొలగించాలని, చెట్లు తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, దోమలు పెరగకుండా చూడాలని అన్నారు .ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, డీఆర్ఓ కే వీవీ రవికుమార్, డీఆర్డీఓ నరసింహులు ,జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.

తక్షణమే కమిషనర్ రాజయ్యను సస్పెండ్ చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ - జడ్చర్ల

సమస్యలు అడగకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, అక్రమాలకు పాల్పడుతూ కార్మికుల పట్ల తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని, తక్షణమే కమీషనర్ రాజయ్యను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ,జిల్లా ఉపాధ్యక్షులు వర్ధగాలన్న, మున్సిపల్ సంఘం జడ్చర్ల నాయకులు మహేష్, కృష్ణ, విజయులు అన్నారు. సీఐటీయూ మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ భోగి విజయేందరికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ రాజయ్య కార్మికులను తొలగించామని బెదిరిస్తున్నాడని తెలిపారు. కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా, అబద్ధాల ప్రచారం చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నాడని తెలిపారు. నిరసన చేస్తున్న కార్మికులను తొలగించినట్లు ప్రచారం చేస్తున్నాడని తెలిపారు. కార్మికులను తొలగించే అధికారం కమిషనర్ లేదని వారు తెలిపారు. తక్షణమే కమిషనర్ రాజయ్యను సస్పెండ్ చేయా లన్నారు. ఆయన పట్ల సమగ్ర దర్యాప్తు జరిపించాలని వారు కోరారు.కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందించి లోకల్ బాడీ అడిషనల్ కలెక్టరుకు దర్యాప్తుకు ఆదేశించారు. ఈ సమస్యలు పరిష్కరించని యెడల సమ్మెలోకి వెళ్తామని వారు ప్రభుత్వ అధికారులకు హెచ్చరించారు.



గురుకుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి :ఎస్ఎఫ్ఐ

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్

గురుకులాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భరత్ డిమాండ్ చేశారు .సోమవారం పిల్లలం మర్రి దగ్గర ఉన్న ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాల ముందు మంచినీటి సమస్య పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన గురుకులాల్లో సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ పట్టణం స్థానిక పిల్లల మర్రి దగ్గర ఉన్న సాంఘిక మహిళా డిగ్రీ గురుకులలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ఉదయం నుండి విద్యార్థులు గేటు దగ్గర కూర్చుని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వం అక్కడికి చేరుకొని సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రధానంగా గత రెండు వారాలుగా నీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రహరీ కూడా లేక వీధి కుక్కలు వస్తున్నాయన్నారు వెంటనే ఎస్ఎఫ్ఐ నాయకత్వం స్థానిక మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్‌కి సమాచారం అందించి పిలిపించడం జరిగింది. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ హామీని ఇచ్చారు.ఈ సమస్యలన్నింటిని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని మూడు రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు తక్షణం మొబైల్ ట్రాన్స్‌ఫార్ బోరు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎలాంటి ఇబ్బం దులు లేకుండా గురుకులాల్లో కచ్చితంగా విద్యార్థులకు నాణ్యమైన అందిస్తామని ప్రభుత్వం తరఫున అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నందు ,మణికంఠ, సాయి తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశం
- ప్రజా సంఘాల నాయకులు

నవ తెలంగాణ -మహబూబ్ నగర్

మున్సిపల్ కార్మికుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్న జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ వెంటనే సస్పెండ్ చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు..సోమవారం సీఐ టీయూ జిల్లా కార్యాలయంలో జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ ను సస్పెండ్ చేయాలని రౌండ్ టేబుల్ సమావేశానికి సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ గత 15 రోజులుగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,విధులు నిర్వహిస్తూనే నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ అమానుషంగా వ్యవహరిస్తున్నారు.సమస్యలు పరిష్కరించకపోగా కమిషనర్ రాజయ్య దురుసుగా వివరిస్తున్నారని ఆరోపించారు. 10 మంది కార్మికులను తొలగించినట్లు యూనియన్ నాయకుడిని విధుల నుండి తొలగించినట్లు చెబు తున్నారని. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ కార్మికులను తొలగించే అధికారం కారం కమిషనర్‌కు లేదని వారన్నారు. ప్రజాస్వామికంగా, నిరంకుశంగా వ్యవహరిస్తున్న కమిషనర్ రాజయ్యను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్‌జిల్లా కార్యదర్శి ఎం కురుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోనెల రాములు ,వరదగాలన్న,మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎర్ర నరసింహులు ,మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కేశవులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఈశ్వర్ ,మణికంఠ, నందు, జడ్చర్ల మున్సిపల్ యూనియన్ నాయకులు మహేష్, కృష్ణ ,విజయ్ ,దామాయపల్లి వెంకటయ్య, కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్ధన్, డివైఎఫ్ఐ నాయకులు భాస్కర్ ఉన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల కోసం నిధులు మంజూరు చేయాలి: ఎమ్మెల్యే



నవతెలంగాణ- బాలానగర్

భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల కోసం రోడ్లు భవనాల శాఖ మంత్రిని నిధులు కోరిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి.రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం హైదరా బాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ఊర్కొండ మండల కార్యాలయం రాజాపూర్ మండల కార్యాలయం కొరకు 32 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ,జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి షాద్నగర్ ఎమ్మెల్యే సహచర శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి. పలువురు ఉన్నారు. గత ప్రభుత్వం మండలాలను ఏర్పాటు చేసింది కానీ ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించలేకపోవటంతో అన్ని మండల కేంద్రాలలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడానికి రోడ్లు భవనాల శాఖ మంత్రిని కలిసినట్లు సమాచారం తెలిసింది.

ప్రైవేట్ ఐఏఎస్ ల భర్తీ మతోన్మాద దురంకరా చర్య

నవ తెలంగాణ -మహబూబ్‌నగర్

లేటరల్ ఎంట్రీ పేరుతో ఆర్ఎస్ఎస్ ప్రైవేటు మనుషులతో ఖాళీ ఐఏఎస్ పోస్టులు భర్తీ చెయ్యడం మనువాద మతోన్మాద కులదురంకార చర్య అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఎం మాణిక్యం రాజు, ఎం కురుమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ను పక్కన పెట్టి లేటరల్ ఎంట్రీ పేరుతో ఆర్ఎస్ఎస్ ప్రైవేటు మనుషులతో దొడ్డి దారిన నింపేందుకు మనువాద మతోన్మాద మోడీ ప్రభుత్వం ప్రయత్నించడం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. 24 కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ వంటి 45 పోస్టులకు లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చెయ్యడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని విభాగాల్లో ఉన్నతస్థాయి పోస్టుల్లో రిజర్వేషన్లు పూర్తిగా గాలికి వదిలి వేసే దుర్మార్గమైన దారుణమైన కులదురంకార చర్య తప్ప మరోకటి కాదన్నారు.యూపీఎస్సీ సాధారణ ఎంపిక ద్వారా చేస్తే 45 మందిలో కనీసం 23 మంది సమర్ధులైన దళిత , గిరిజన, బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులు అవమాన పరచడం అవుతుందన్నారు. మనుస్మృతి అమలు చేయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. మనువాద మతోన్మాద మోడీ దుర్మార్గమైన, దారుణమైన కులదురంకార చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి కీలక స్థానాల్లో ఆర్ఎస్ఎస్ ప్రైవేటు మనుషులతో దొడ్డి దారిన నింపేందుకు చేస్తున్న ఈ చర్యలు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పద్మశాలి పురస్కారాల ప్రధానోత్సవం

నవతెలంగాణ- మహబూబ్‌నగర్

నాగరికతకు పెట్టింది పేరైన పద్మశాలీల వల్లనే సమాజం గౌరవంగా బతుకుతున్నదని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన నూలు పౌర్ణమి, టీపోపా ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి కులదైవమైన మార్కండేయస్వామి దేవాలయం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు అప్పం అనంతరాములు, జిల్లా కార్యదర్శులు సూర ప్రతాప్, దాసు వేంకటేశ్, సంఘం నాయకులు బిజ్జ శంకర్, జన్ను వేంకటేశ్, కొంగరి సత్యనారాయణ, కడదాసు సత్యనారాయణ, పల్లాటి బుచ్చన్న, ఒగ్గు సత్యనారాయణ, బోగం శివాజీ, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు పల్లాటి బాలరాజు, ప్రధాన కార్యదర్శులు కోడి రాజశేఖర్, కడదాసు సత్యనారాయణ,జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు కొంగరి వేంకటేశ్, పట్టణ యువజన సంఘం అధ్యక్షులు నీలి కిశోర్, కోడి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వనపర్తి
మంగళవారం | ఆగస్టు 20, 2024 | www.navatelangana.com

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: ఏఎస్పీ



నవతెలంగాణ-ఆత్మకూరు

సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని అడిషనల్ ఎస్పీ తేజవత్ రామదాసు అన్నారు. ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో దాదాపు రూ.1.30లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాల నియంత్రించవచ్చని, ఇతర కేసులను చేధించడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నానన్నారు. అనంతరం గ్రామస్తులు పోలీసులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్, రేచింతల పీఏసీసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి ఆరేపల్లి గ్రామ పెద్దలు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు :ఎస్పీ

నవతెలంగాణ-వనపర్తి రూరల్



జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించి ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసు కున్నారు. వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత స్టేషన్ల సీఐ, ఎస్సైలకు ఫోన్ ద్వారా వివరించి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు మధ్యవర్తి లేకుండా నిర్భయంగా పోలీసుల సేవల్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు.

వంద శాతం రుణమాఫీ చేయాలి

- ఇప్పటివరకు 45 శాతం రైతులకే లబ్ధి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్

నవతెలంగాణ-వనపర్తి



రైతు రుణమాఫీ వంద శాతం అమలు చేయాల్సిందేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ రైతులకు పూర్తిస్థాయిలో మాఫీ కాలేదని పేర్కొన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 567 సవరణ చేయకపోవడం వల్ల ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 45 శాతం రైతులకు మాత్రమే లబ్ధి చేకూరిందని విమర్శించారు. వనపర్తి జిల్లా పరిధిలో వేల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. 567 జీవో సవరణ చేయకపోవడం, బ్యాంకర్ల తప్పిదాల వల్ల వేల మంది రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. పీపనగండ్ల మండలంలో ఐఓబి బ్యాంకును పరిశీలిస్తే మొత్తం నాలుగు వేల రైతుల ఖాతా లు ఉన్నాయన్నారు. ఒక లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు 2,970 మంది ఉండగా అందులో ఇప్పటివరకు 700 మంది రైతులకు రుణం మాఫీ కాలేదని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు ఐఎఫ్‌సీ కోడ్ తప్పుగా నమోదు చేయడం వల్ల, హైదరాబాద్ కేంద్ర బ్రాంచ్‌లో అధికారుల తప్పు కారణంగా ఈ రైతులు రుణమాఫీకి అర్హులు కాలేకపోయారని వివరించారు. లక్షన్నర లోపు రుణాలు తీసుకున్న రైతులు 1055 మంది ఉన్నారని, అందులోనూ 500 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు బ్యాంకు అధికారులు చూపిస్తున్నారని తెలిపారు. రెండు లక్షల లోపు రుణం తీసుకున్న రైతుల ఖాతాలు 525 మంది ఉండగా కేవలం 17 మందికి మాత్రమే మాఫీ అయిందని తెలి పారు. అలాగే సుదీర్ఘకాలంగా అప్పులు చెల్లించని రైతులు (నాన్ ప్లానింగ్ అకౌం ట్) మరో 300 మంది ఉన్నారని తెలిపారు. ఒక మండల కేంద్రంలోని బ్యాంకు పరిధిలో 2000 మందికి పైగా రైతులు రుణమాఫీకి అర్హులు కాలేదంటే, ప్రభుత్వం తెచ్చిన జీవో, అధికారుల తప్పిదాల వల్లనే ఇలా జరిగిందని స్పష్టంగా తెలుస్తుందన్నారు. పీపనగండ్ల మండలం పరిధిలోని కొంతమంది రైతులకు బ్యాంకు అధికారులు చేసిన తప్పిదాలను సరిచేసి రుణమాఫీకి అర్హులను చేయాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రతి మండలం జిల్లా పరిధిలో ఇంకా ఎంతమంది రైతులు ఉంటారో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 567 జీవోను సవరించాలని, అలాగే బ్యాంకులో ఉన్న ప్రతి రైతు ఖాతాకు రుణమాఫీని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కుటుంబాలు, రెండు బ్యాంకుల్లో ఉన్న రైతుల రుణాలు, రిటైర్డ్ అయిన ఉద్యోగస్తుల రైతు రుణాలు, ఉద్యోగస్తుల రైతు రుణాలను రుణమాఫీ పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి బ్యాంకర్ల సమావేశాన్ని సమీక్ష చేయాలని వంద శాతం రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలి

- మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ- పాన్‌గల్

రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. పాన్‌గల్ మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలో వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, రైతు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ విషయంలో స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీకి రకరకాల నిబంధనలు పెట్టి రైతులను మోసం చేస్తుందన్నారు. ఆరుగ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రైతు భరోసాను కూడా ఇప్పట్టివరకు అమలు చేయలేదన్నారు. రైతు ప్రభుత్వం చెప్పుకునే కాంగ్రెస్ రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందన్నారు. కేఎల్ఐ, బీమా కాలువల ద్వారా చివరి ఆయకట్టుదారులకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతుభరోసాలో సరైన స్పష్టత రాకపోతే రైతు సంఘం, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేపడ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు మాజీ సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు



నవతెలంగాణ- పెబ్బేరు

శ్రీరంగాపూర్ మండలంలోని కంబాలాపురం గ్రామంలో ఊరి మధ్యలో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కలను సోమవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో తొలగించినట్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కంపచెట్లతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు మండల కాంగ్రెస్ నాయకుడు బీరం రాజశేఖర్ రెడ్డికి వివరించగా ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఎమ్మెల్యే కంప చెట్లు , పిచ్చి మొక్కలను తొలగించే బాధ్యతను కంబాలాపురం గ్రామ కాంగ్రెస్ కన్వీనర్ మల్లేష్‌కి అప్పగించారు. మల్లేష్ కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి, గుంతలను చదును చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీరం రాజశేఖర్ రెడ్డి, మల్లేష్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, బోయ కృష్ణయ్య, తెలుగు రాజు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 22న ఛలో హైదరాబాద్

నవతెలంగాణ -అమరచింత

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి. హనుమంతు తెలిపారు. సోమవారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో గోడపత్రికను విడుదల చేస్తూ హనుమంతు మాట్లాడారు. అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణం కై పది లక్షల రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వానికి ఆయన కోరారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ సక్రమంగా అమలు జరగడంలేదని ఆందోళన చెందారు. భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు అయ్యేటట్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం హైదరాబాదులో జరుగుతున్న ధర్నా కార్యక్రమానికి ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, మండల కార్యదర్శి కె.రాజన్న, పట్టణ కార్యదర్శి సామెల్, నాయకులు భక్తి, బాలస్వామి, ఎసన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధం..



- గ్రామ గ్రామానా ఆడపడుచుల సందడి
- సోదరులకు రాఖీలు కట్టిన అక్కాచెల్లెలు

నవతెలంగాణ-పెబ్బేరు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా మెట్టింటి నుంచి ఆడపడుచులు పుట్టింటికి చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. అక్కాచెల్లెలు, అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. సోదరులు వారి స్తోమతకు తగ్గ కానుకలిచ్చి, ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని ఇబ్బందులు తలెత్తినా మీకు అండగా ఉంటామని ఆడపడుచుల ఆశీర్వాదాలు తీసుకున్నారు.

వీపనగండ్లలో..

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు గోవర్ధనగిరి, గోపాల్‌దిన్నె, కల్వరాల, పుల్గర్‌చర్ల తదితర గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అక్కా,చెల్లెళ్లు అన్నాదమ్ములకు రాఖీలు కట్టి ప్రేమానురాగాలను పంచుకున్నారు.

మదనాపురంలో..

మదనాపురం: మండలంలో రాఖీ పౌర్ణమి సంబురాలను అన్నా చెల్లెళ్ళు, అక్కతమ్ముళ్లు ఉత్సా హంగా జరుపుకొన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచులు పుట్టిల్లకు వచ్చి సోదరులకు రాఖీలు కట్టారు.



ఆత్మకూరులో..

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం రాఖీ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పోలీస్‌స్టేషన్ ఆవరణలో అదనపు ఎస్పీ తేజవత్ రామదాసు, సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం కార్మికులు పార్వతమ్మ, చిన్నమ్మ, బాలకృష్ణమ్మ, శైలజ, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత: రాఖీపౌర్ణమి వేడుకలను సోమవారం అమరచింత మండల ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోన్నారు. అమరచింత మున్సిపాలిటీలో పద్మశాలీలు రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మహంకాళి విష్ణు, ప్రధాన కార్యదర్శి మహంకాళి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు తాటికొండ లచ్చన్న, పారుపల్లి చింతన్న, తిరుమల నరసింహ, పారుపల్లి శ్రీనివాసులు, తాటికొండ రమేష్, క్యామ కుమార్, మహంకాళి ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.











సీజనల్ వ్యాధుల నియంత్రణకు
సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

నవతెలంగాణ-వనపర్తి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు జిల్లాలో ఎక్కడ నమోదైన వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో పాజిటివ్ కేసు నమోదైన వెంటనే రోగి పేరు, సెల్ నెంబర్, పూర్తి చిరునామా జిల్లా వైద్య అధికారి వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది పాజిటివ్ వచ్చిన వ్యక్తి కుటుంబ సభ్యులతో పాటు చుట్టూ పక్కల జ్వరం సర్వే, రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. మున్సిపల్, వైద్య సిబ్బంది, అధికారులు పాజిటివ్ వచ్చిన వ్యక్తి ఇంటికి చేరుకొని దోమల వ్యాప్తి ఎక్కడి నుండి జరుగుతుందని తెలుసుకొని నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జ్వరంతో వచ్చే ప్రతి ఒక్కరి రక్త నమూ నాలు సేకరించి డయగ్నోస్టిక్ కోసం ఎలిజా సెంటర్‌కు పంపించాలని సూచించారు.

కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య ఖర్చులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య రేటు తెలిపే సూచిక బోర్డులు ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద పెట్టాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజే రియన్‌లు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని వీటిని కట్టడి చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పని చేసే మహిళా డాక్టర్లకు, మహిళా సిబ్బందికి పోలీస్ శాఖ భద్రత కలిస్తుందన్నారు. నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు కలిగిన నూతన ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, డయగ్నస్టిక్ సెంటర్లకు జిల్లా కమిటీ ద్వారా ఆమోదం, కొత్తగా ఆసుపత్రులు, డయగ్నస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లు, పాత వాటికి రెన్యువల్ కోసం ఆన్లైన్ ద్వారా పెట్టుకున్న దరఖాస్తులను కలెక్టర్ అధ్యక్షతన కమిటీ పరిశీలించి నింబంధనలు మేరకు ఉన్నవాటికి ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్, అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్, డా. సాయినాథ్ రెడ్డి, పిహెచ్‌సిల డాక్టర్లు, ప్రైవేట్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించడంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించటంలో వేగం పెంచాలని సూచించారు. ఆయా శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను అధికారులకు గుర్తు చేశారు. వచ్చే ప్రజావాణిలోగా పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 18 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలోజిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలో సోమవారం ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ శ్రీరాములు, శ్రీనివాసులు, ప్రేమ్, ప్రసాద్, నరేష్ , ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు, డాక్టర్ ప్రసన్న, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు: పట్టణంలో లైఫ్‌స్టైల్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుభాష్ చౌరస్తాలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి సీనియర్ ఫోటోగ్రాఫర్ వెంకటన్న పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది ఫోటోగ్రాఫర్స్ కెమెరానే నమ్ముకొని జీవితం కొనసాగిస్తున్నారని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఫోటోగ్రాఫర్లను చేతి వృత్తిదారులుగా గుర్తించి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోటి ఫోటోగ్రాఫర్ మధు కుటుంబానికి రూ.20వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాములు, విజయ్, వెంకటరామారెడ్డి, అంజనేయులు, కృష్ణ, చంటి, మహేష్, సుధాకర్, ఖాజా, శీను, విజయ్, తిరుపతి, శివ, బీచుపల్లి యాదవ్, శివరాజు, తిరుపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత: మండల కేంద్రంలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొట్టం ప్రతాపరెడ్డి లూయిస్ టకురే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫోటోగ్రాఫర్స్‌కు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు మహేందర్‌జీ, విజయ్, క్రాంతి, శ్రీధర్, రవి, శ్రావణ్ కుమార్, జగన్, కవిరాజు, అరుణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో నివాళులర్పిస్తున్న ఫోటోగ్రాఫర్స్



ఆత్మకూరులో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఫోటోగ్రాఫర్స్



పెబ్బేరులో నివాళులర్పిస్తున్న ఫోటోగ్రాఫర్స్

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

నవతెలంగాణ- ఆత్మకూర్

ఆత్మకూరు మండల పరిధిలోని లోయర్ జూరాల పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) సూపరింటెండెంట్ రామసుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 24 గంటల్లో 56.689 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అయినట్లు పేర్కొన్నారు. ఆరు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా జూరాల ప్రాజెక్టులో ఐదు యూనిట్లలో 21.550 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రసవం

నవతెలంగాణ-వనపర్తి రూరల్



ఆర్టీసీలో ప్రయాణిస్తున్న ఓ నిండు గర్భిణి బస్సులోనే బిడ్డకు జన్మనిచ్చింది. ఆర్టీసీ అధికారుల సమచారం మేరకు గద్వాల నుంచి వనపర్తికి వస్తున్న పల్లె వెలుగు బస్సులో ప్రయాణిస్తున్న గద్వాల మండలం రామంజి కొండపల్లికి చెందిన నిండు గర్భిణి సంధ్య ప్రయాణిస్తుండగా వనపర్తికి 15 కిలోమీటర్ల దూరంలో నాచపల్లి గ్రామం వద్ద పురిటి నొప్పులు రాగా వెంటనే కండక్టర్ భారతి డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సూచనల ప్రకారం బస్సులోని ప్రయాణికులను కిందకు దింపి బస్సులో ప్రయాణిస్తున్న ఒక సిస్టర్ సహాయంతో గర్భిణికి కాన్పు చేశారు. తల్లి బిడ్డా క్షేమంగా ఉన్నారు. అనంతరం 108కు అంబులెన్స్‌లో వనపర్తికి పంపించారు.

మూడు పాముల పట్టివేత

నవతెలంగాణ- పెబ్బేరు

పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామంలోని కాలువ నాగన్న ఇంటి నిర్మాణం కొరకు వేసిన రాళ్లకుప్పలో రెండు పాములను గుర్తించిన గ్రామస్తుడు కురువ రవీందర్ భయాందోళనకు గురై వెంటనే వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన స్నేక్ సొసైటీ సభ్యులు కృష్ణసాగర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకొని జేసీబీ సహాయంతో రాళ్ల కుప్పను తొలగించి అందులో ఉన్న మూడు జెర్రిపోతు పాములు, ఒక కామన్ సాండ్‌బోయ పాను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కృష్ణసాగర్

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్తులకు డయల్ 100, దొంగతనాలు, గంజాయి, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్నేక్ సొసైటీ సభ్యుడు అవినాష్ , గ్రామస్తులు సత్యనారాయణ గౌడ్ రవీందర్, నాగరాజు, భానుచందర్, భరత్, మహేష్, రాముడు ,కథల్ ,వెంకటేష్ అల్లన్న గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాల మహానాడు జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ- వనపర్తి రూరల్

జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సోమవారం మాల మహానాడు జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నే త్యాగయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మూలకపల్లి మద్దిలేటి, కార్యనిర్వాక అధ్యక్షులుగా మాదారి రఘురాం, ప్రధాన కార్యదర్శులుగా మద్దెల మధుసూదన్, మలిపెద్ది వెంకటేష్, కోశాధికారిగా ముప్పటి బాలస్వామి, ఉపాధ్యక్షులుగా బండారి రాజ్‌కుమార్ , సంగమాల అక్షయుడు, కార్యదర్శులుగా చింతల రాఘవేందర్ జిల్లా సహాయ కార్యదర్శులుగా నాగరాజు జిల్లా గౌరవ సలహాదారులుగా బాపన్ పల్లి వెంకటేష్ , సామా వెంకటయ్య, ఎద్దుల శంకరయ్య, గుర్రాల సింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపకులాలను వర్గీకరణను నిరసిస్తూ ఈనెల 21న అన్ని దళిత గిరిజన సంఘాలు ఇచ్చిన భారత్ బంద్‌కు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ , ప్రైవేటు రంగ సంస్థలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

'రాఖీ' సందడి

- బస్టాండ్, షాపుల్లో జనం కిటకిట
- ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసి ప్రాయాణం



నవతెలంగాణ- వనపర్తి

వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం ఎటు చూసినా రాఖీ పండుగ సందడి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఆడపడుచులు పిల్లా పాపలతో వస్తుండడంతో ప్రధాన రహదారులు, బస్టాండ్ జనంతో కిటకిటలాడాయి. సూదూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు రాఖీలు, స్వీట్లు కొనుగోలు చేయడంతో రాఖీ దుకాణాలు, స్వీట్ల దుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

రాఖీ పండుగను పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నిడిపిస్తున్నది. ప్రతిరోజు హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను 40 ట్రిప్పుల మేర నడిపిస్తారు. రోజు నడిచే వాటితో పాటు రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా 20 ట్రిప్పులు నడిపించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. జిల్లా పరిధిలోని చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే మహిళలంతా వనపర్తి జిల్లా కేంద్రం మీదుగా వెళ్తుండడంతో ప్రధాన రోడ్లన్నీ ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలతో రద్దీగా కనిపించాయి.

'కలిసొచ్చిన 'మహాలక్ష్మి'

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మీ పథకంలో భాగంగా అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు కలిసొచ్చింది. గతంలో పండగల వేళల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సుల పేరుతో టికెట్ ధరలు అధికంగా వసూలు చేసేది. దీంతో హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మహిళలు పిల్లా పాపలతో రావాలంటే వేల రూపాయలు టిక్కెట్ల వెచ్చించేదని మహాలక్ష్మి పథకం అమలుతో కొంత ఇబ్బందులు పడుతున్నా డబ్బులు ఆదా అవుతున్నాయని ఆడపడుచులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రయాణికులకు ఇబ్బందులు కలగనివ్వం



పండుగల వేళ ప్రయాణికులకు ఇబ్బందులు కలుగ కుండా రెగ్యులర్‌గా కొనసాగించే బస్సులతో పాటు అదనుపు బస్సులు నడిపిస్తున్నాం. ప్రత్యేక సర్వీసులతో ఆర్టీసీకి అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

- వడ్లకొండ వేణుగోపాల్, డీఎం, వనపర్తి డిపో

3
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
మంగళవారం | ఆగస్టు 20.2024 | www.navatelangana.com

చిన్న చెరువులను మినీ ట్యాంక్‌బండ్లుగా ఏర్పాటు చేస్తా

- మంత్రి వద్ద నిధులు తెస్తా
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి

నవతెలంగాణ- బాలానగర్



జడ్చర్ల కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ కు అభివృద్ధి పనుల్లో భాగంగా నిధులు కేటాయించి సీసీ రోడ్లు, వీధి లైట్స్, జిమ్, పిల్లల ఆటస్థలం లాంటివి అతి త్వరలో ఏర్పాటు చేసి దీనిని కూడా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డిని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి కోరారు. సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్చర్ల కేంద్రంలో సర్వేనెంబర్ 477 లో గల మినీ ట్యాంక్ బండ్ కి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.బాలానగర్‌మండల కేంద్రంలోని చిన్న చెరువును మినీ ట్యాంక్ బండ్ గా చేసి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి రెండిటిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోరారు. బాలానగర్ మండలంలో ఉన్న చిన్న చెరువు మినీ ట్యాంక్ బండ్ గా మారుతుంది. దానివలన మండల వాసులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జడ్చర్ల కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ కు అభివృద్ధి పనుల్లో భాగంగా నిధులు కేటాయించి సీసీ రోడ్లు, వీధి లైట్స్, జిమ్, పిల్లల ఆటస్థలం లాంటివి అతి త్వరలో ఏర్పాటు చేసి దీనిని కూడా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు.మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పందించి వెంటనే బాలానగర్ జడ్చర్ల మినీ ట్యాంక్ బండ్లలో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.. ధన్యవాదాలు తెలిపిన మహబూబ్‌నగర్ జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ తిరుపతి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్,మండల కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'

నవతెలంగాణ- వంగూరు



ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు అంకు సురేందర్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో ఇప్పటివరకు 46 శాతం మాత్రమే అయ్యిందని, ఆగస్టు 15 వరకు రెండు లక్షలు ఉన్నవారికి ప్రతి ఒక్కరికి పడతాయని చెప్పిన మాటలు నీటి మూటలు గాని మిగిలినయని అన్నారు. విద్యుత్ జీరో బిల్లు సగం సగం మాత్రమే కావడంతో జీరో బిల్లు కాని వారి సంగతేంటి అని ఆయన ప్రశ్నించారు.500 కే సిలిండర్ అనే ఊసే లేదు, 910 రూపాయలు సిలిండర్ కు చెల్లిస్తే 370 తిరిగి అకౌంట్లో పడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన అన్నారు. రైతు భరోసా లేదు మహిళలకు 2500 లేవు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు గమనించి స్థానిక ఎలక్షన్లలో రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని ఆయన అన్నారు.

కరెంటు కోతలు ఆపండి : డీహెచ్పీఎస్

నవ తెలంగాణ-నాగర్‌కర్నూల్‌రూరల్

తెలంగాణలోని అన్ని జిల్లాలో కోతలు లేని కరెంటు సరఫరా చేసి రైతన్నలకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ, 24/7 గంటలు ఉచిత కరెంటు సరఫరా అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. కానీ ఆచరణలో అది సాధ్యం కావడం లేదను మాటను గుర్తించాలన్నారు. రాష్ట్రంలో కరెంటు నిరంతరం కోతలతోనే సరఫరా అవుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కాస్త మెరుగ్గానే ఉన్నప్పటికీ, ఇటీవల కాలంలో గంటకో సారీ, అరగంటకోసారీ ఇలా.. ప్రతిరోజు కరెంటు కోతలు లేని దినం లేదన్నారు. రైతుల పొలాలకు నీరు పారకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వ లోపమా లేక యంత్రాంగంలో సమన్వయం లేకపోవడమా తెలియదు గానీ మొత్తంగా ఇటు రైతులు అటు ప్రజలు కరెంటు కోతల వలన ఇబ్బందులకు గురి అవుతున్నారని విమర్శించారు. వరి నాట్లు వేసుకున్న రైతన్న కరెంటు కోతల వలన నీరు సరిగ్గా అందక బెంబేలెత్తిపోతున్నారని ఆవేదన చెందారు. ఇటీవల వర్షాలు బాగా పడకపోవడంతో బోర్లు ఉన్న పత్తి నాటుకున్న రైతులు బోర్ల ద్వారా నీటిని పారించడానికి ప్రయత్నిస్తే కరెంటు సహకరించక పోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలో కోతలు లేని కరెంటు సరఫరా చేసి చూపాలని అన్నారు. అలాగే 2 లక్షల రూపాయల రుణమాఫీ అంటూ ఆర్భాటంగా ప్రచారం చేశారు. కానీ ఆచరణలో మాత్రం ఇప్పటికీ చాలా మంది రైతుల రుణాలు మాఫీ కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అందుకే అర్హులైన ప్రతి రైతుకు రుణాలను మాఫీ చేయాలని, అనవసరమైన టెక్నికల్ సమస్యలకు గురి చేయకుండా రైతాంగం మొత్తానికి రుణమాఫీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. 2023 డిసెంబర్ మాసంలో 40, 50,70శాతం వరకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఏ ఒక్క రైతుకు పూర్తిస్థాయిలో మాఫీ చేయలేదన్నారు.రుణమాఫీ కానీ రైతుల కోసం ప్రత్యేక కౌంటర్స్ ఏర్పాటు చేసి వ్యవసాయ అధికారులను సంప్రదించాలంటూ అంటూ రైతులకు ప్రభుత్వం సూచనలు చేస్తుందని తెలిపారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ బిజినేపల్లి

మండలంలోని పోలేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో సోమవారం గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్టాపన ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. మూడు రోజుల పాటు వేద బ్రహ్మణుల మంత్రోచ్చరణలతో, మేళతాళాలతో గ్రామస్తులు అం దరూ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహించారు. గ్రామస్తులందరికీ ఉచిత అన్నదానం చేపట్టినట్లు మాజీ సర్పంచ్ గంగారం అశోక్ తెలిపారు. ప్రత్యేక పూజల్లో మాజీ ఉపసర్పంచ్ వసంత్ కుమార్, మహేందర్, జి. వెంకటయ్య, శ్రీశైలం, భానుప్రకాశ్ రెడ్డి, కుమార్, బాల్ చంద్రయ్య శివయ్య, కొమురయ్య, మల్లేష్, శ్రీనివాసులు, బొల్లం శివ, రాజు, శివ, యువక లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయవాదులపై పోలీసుల దాడులను అరికట్టాలి

- న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన

నవతెలంగాణ- అలంపూర్

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న సంతోష్ అనే న్యాయవాది పట్ల పోలీసులు ప్రవర్తించిన సంఘటను నిరసిస్తూ సోమవారం తెలంగాణ న్యాయవాద ఫెడరేషన్ పిలుపుమేరకు అలంపూర్ అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఇతను బహిష్కరించారు. అంతకు ముందు న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని తీర్మానం చేశారు. న్యాయవాదులపై పోలీసుల దాడులను అరికట్టాలన్నారు. న్యాయవాదుల పై దాడులను చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని నినాదాలు చేశారు. తీర్మానంను న్యాయమూర్తి కమలాపురం కవితకు అందజేశారు. కార్యక్రంలో న్యాయవాదులు నారాయణ రెడ్డి , తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు యాదవ్, అంజనేయులు, యాకోబు, ఈదురు సాబ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బందికి పదోన్నతి పత్రాలందజేత

నవతెలంగాణ -కల్వకుర్తి



విద్యుత్ శాఖలో పనిచేస్తున్న జేఎల్ఎం లకు ఉన్నతాధికారులు ఏఎల్ఎం గా ప్రమోషన్లు ఇవ్వడంతో వారికి పదోన్నతి పత్రాలను కల్వకుర్తి సబ్ డివిజన్ ఏడీఈ చంద్రశేఖర రావు సోమవారం అందజేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో మొత్తం 76 మంది జేఎల్ఎం లకు ఏఎల్ఎం గా పదోన్నతి లభించింది. దీంతో వారికి పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రమోషన్ పొందిన అభ్యర్థులకు రెండు ఇంక్రిమెంట్లు కలిపి అధికారులు ప్రమోషన్ ఇచ్చారు. అనంతరం ఏడిఈ మాట్లాడుతూ ప్రమోషన్ పొందిన అభ్యర్థులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రమోషన్ పొందిన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘం 1104 యూనియన్ జిల్లా నాయకులు తిరుపతయ్య, సబ్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, సీనియర్ నాయకులు పాండు నాయక్, బలరాం నాయక్ తదితరులున్నారు.

చెరువులు వెలవెల... ఉపాధి గలగల

- రెండు మాసాలు గడిచిన పారని వాగులు, నిండని చెరువులు
- 193.78 చేప పిల్లల పంపిణీ టెండర్లు
- సహకార సంఘాలకు ఎన్నికలు లేక కేంద్ర నిధులు నిల్
- ఈ ఏడాది మత్స్య సంపద పై నీలి నీడలు



ఒట్టిపోయిన వాగులు.... ఎండిన బావులు... నిండని చెరువులు ఇది మహబూబ్ నగర్ జిల్లా మత్స్య సంపద పరిస్థితి. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ సిద్ధం అయినా నిండని చెరువులు, కుంటలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి జరగని సహకార సంఘాల ఎన్నికలు కేంద్రం నుంచి రావలసిన నిధులు శూన్యం. ఎండిన చెరువులు అదునుగా ఉపయోగించుకొని కబ్జాలు. ఈ ఏడాది 11496 మంది మత్స్య కార్మికుల ఉపాధి పై నీలి నీడలు.

నవ తెలంగాణ మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ జిల్లా కరువు కాటకాలకు నిలయం. వలసలకు పెట్టింది పేరు. మొత్తం జిల్లా విస్తీర్ణంలో కోయిల్ సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టు మినహా వర్ష పై ఆధారపడి మత్స్య సంపద ఉండే జిల్లా ఇది. మహబూబ్ నగర్ జిల్లాలో 1085 చెరువులు కుంటలు ఉంటాయి. 213 మధ్యపారసామిక సహకార సంఘాలలో 11496 మంది మత్స్య కార్మికులు సభ్యత్వం కలిగి ఉన్నారు. చెరువులు కుంటల్లో పెరిగిన చేపలను వ్యాపారం చేసుకునేందుకు194 మంది సభ్యులతో ఒక మార్కెటింగ్ సంఘం ఉన్నది. మత్స్య శాఖ మహిళలను అభివృద్ధి చేసే ఉద్దేశంతో 773 మంది సభ్యులతో 20 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు నెలకొల్పింది. ఇంతవరకే బాగున్న వర్షుడు కరుణిస్తే తప్ప ఉపాధి లభించని స్థితి ఇక్కడి మత్స్యకారులది. ఈ ఏడాది వానకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తి అయిన ఇప్పటివరకు ఎక్కడ వాగులు పారలేదు చెరువులు నిండలేదు.ఉన్నంతలో దేవరకద్ర నియోజకవర్గంలో ఉన్న చెరువులు 30 శాతం నిండగా మిగతా రెండు నియోజకవర్గాలలో ఖాళీ గా ఉన్న చెరువులే దర్శనమిస్తున్నాయి. జనాభాలో 56% గా ఉన్న మత్స్యకార కుటుంబాలు ఉపాధి అవకాశాలు లేక దారుణమైన ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. విద్యలో కూడా ఉన్నత చదువులు చదివే వారి సంఖ్య పది శాతం మించదు. చేపలు పట్టేందుకు ఎలాంటి స్కిల్స్ వీరికి ఉండవు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ డెవలప్మెంట్ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాకాలు లేవు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీలో మత్స్య సంపదపై ప్రత్యేక కోర్సులు పెట్టాలని పలువురు కోరుతున్నారు. రాజకీయ పదవులలో కూడా వీరు కనిపించరు. రాష్ట్రంలో అతిపెద్ద జనాభా కలిగిన మత్స్య కుటుంబాలకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క మంత్రి కూడా ఉండకపోవడం శోచనీయం. ముదిరాజ్ కుటుంబాలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలుగానే చూస్తున్నారని



ఆర్థికంగా ఎదిగడానికి ప్రభుత్వాలు ఎలాంటి చొరవ చూపడం లేదని సహకార సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి కల్తీ లేని మాంసాకృతులు అందించే చేపల పట్టేందుకు వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు చనిపోతే 5 లక్షల ఆర్థిక సహాయం అందించే పథకం ఉన్న గడిచిన తెలంగాణ రాష్ట్ర పాలనలో ఏ ఒక్క కుటుంబానికి అందిన దాఖలు లేవు.

చేప పిల్లల పంపిణీ టెండర్లు పిలిచినా ప్రభుత్వం

మహబూబ్ నగర్ జిల్లాలో 1091 చెరువులలో 193.77 లక్షల ఉచిత చేప పిల్లల పంపిణీ ఇటీవల టెండర్లు పిలిచింది. గత ఏడాది గత ప్రభుత్వం టెండర్ దారులకు డబ్బులు చెల్లించకపోవడంతో ఏ చెరువుల్లో కూడా ఉచిత చేప పిల్లలు వదలలేదు. అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అనే సామెత మాదిరిగా ఈ ఏడాది ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ సిద్ధంగా ఉన్న వర్షుడు కరుణించలేదు. చెరువులు కుంటలు నిండలేదు. మత్స్య సంపదపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

పోరు తెలంగాణలో ఎన్నికలు తెలవని మత్స్యకారులు

చట్టసభలలో పాలన నిర్ణయాలు చేసుకొని ప్రభుత్వాలకు క్రమం తప్పకుండా ఐదు ఏళ్లకు ఒక్కసారి ఎన్నికలు నిర్వహించుకొని పదవులు అనుభవిస్తున్నారు. తెలంగాణ పోరాటంలో తెగింపు ధైర్యం ఉన్న మత్స్యకారులు ముందు వరుసలో ఉండి పోరాడిన వాళ్ళు అనేకం. కానీ సొంత రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐదు ఏళ్లకు ఒక్కసారి జరగవలసిన మత్స్య పారసామిక సహకార సంఘ 12 ఏళ్లుగా నిర్వహించకపోవడం మత్స్యకారులపై ఈ ప్రభుత్వాలకు ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎన్నికైన జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షుని గడిచిన ప్రభుత్వంలో పదేళ్లు కొనసాగించడం నిరంకుశ పాలనకు నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. సహకార సంఘాలకు డైరెక్టర్లు అధ్యక్షులు ఉంటేనే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలు నిరంతరం వస్తాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైన మత్స్య సహకార సంఘాలకు త్వరగా ఎన్నికలు నిర్వహించాలని మత్స్యకారులు కోరుతున్నారు. వ్యవసాయం, కూలి, చిరు వ్యాపారాలు, చాపల అమ్మకం పై ఆధారపడ్డ ఈ కుటుంబాలు ఈ ఏడాది మత్స్య సంపద రావడం కష్టమే అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల కబ్జాలు... కలుషిత భూతం

జిల్లాలో భారీ వర్షాలు లేక నీళ్ల లేని చెరువులను చూసి కొంతమంది రాజకీయ నాయకుల అండదండాలతో యదేచ్ఛగా చిక్కం భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు చెరువులపై పనిచేసే డైరెక్టర్లు లేకపోవడం ఒక కారణంగా చెబుతున్నారు. పట్టణాలకు దగ్గరగా ఉన్న పెద్ద చెరువులలో కలుషితకు నీరు చేరి చేపల మరణాలకు కారణమవు తున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు పాల కొండ చెరువు ఇప్పటికే కలుషితం నీరు చేరి ఉన్న చేపలు చనిపోయిన దృశ్యాలు మన ముందు ఉన్నాయి. ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మురికి నీరు చర్లకు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడంలో విఫలం అవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మత్స్య సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహించాలి



జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ కుటుంబాలు మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నాం. ఏడాది ఇప్పటికే చేప పిల్లల పంపిణీ టెండర్లు పిలిచారు. ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే కేంద్రం నుంచి రావలసిన నిధులు వస్తాయి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ప్రమాద బీమా పథకం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కబ్జాలకు గురవుతున్న చెరువులపై ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం చేప పిల్లలు పంపిణీ చేసే టెండర్ దారులకు డబ్బులు చెల్లించకపోవడంతో ఈ ఏడాది కొంత ఆలస్యమైందని తెలిపారు.

గంజి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు ,మత్స్య పారిశ్రామిక సహకార సంఘం.

ఫోటోగ్రాఫర్ వృత్తి గొప్ప కళ



తెలకపల్లిలో..

నవ తెలంగాణ- వంగూరు

ఫోటోగ్రాఫర్ వృత్తి మహా గొప్ప కళ అని వంగూరు మండల ఫోటోగ్రాఫర్ అధ్యక్షులు రమేష్ అన్నారు. సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కెమెరా సృష్టికర్త అయినటువంటి లూయిస్ జాకాస్ మండే డాగురె చిత్రపటానికి పూలమాలవేసి సంబరాల నిర్వహించి స్వీట్లు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో వందల సంవత్సరాల క్రిందట దించినటువంటి ఫోటోలు ఇప్పటివరకు ఉన్నాయంటే ఒక గుర్తింపు అని పేర్కొనవచ్చని అన్నారు. తాత ముత్తాతల తరాలు మారిన నాటినుండి ఇప్పటివరకు ఫోటోలు ఉన్నాయంటే కేవలం అది ఫోటోగ్రాఫర్ ఘనత అని అన్నారు. ఇలాంటి ఫోటోగ్రాఫర్ వృత్తిపై ఈ మధ్యకాలంలో మొబైల్ రావడంతో ఫోటోగ్రాఫర్ వృత్తి నడ్డి విరిగినట్లు అయ్యిందని అన్నారు. ఫోటో వృత్తి నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది కావున ప్రభుత్వం గుర్తించి కార్పొరేషన్ లోన్ల మాదిరిగా ఫోటోగ్రాఫర్లకు ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లు కొండల్ గణేష్ నవీన్ నరేష్ రమేష్ విష్ణు స్వప్న అజయ్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్ : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా కొల్లాపూర్ మున్సిపల్ టౌన్ ఎన్టీఆర్ చౌరస్తాలో సీనియర్ ఫోటోగ్రాఫర్లకు.సన్మానం చేసిన కట్ట శ్రీనివాస్ ముదిరాజ్. అనంతరం కేక్ కట్ చేసి కొల్లాపూర్ పట్టణ ప్రజలందరికీ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కట్ట శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల జీవన విధానం గురించి ,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి యొక్క ఫోటోగ్రాఫర్ కు వీడియో గ్రాఫర్ కు ఎలాంటి షరతులు లేకుండా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ఫోటో స్టూడియో లకు ఉచిత విద్యుత్తు మరియు ప్రమాదవశాత్తు చనిపోయిన ఫోటోగ్రాఫర్ కు 5 లక్షల ప్రభుత్వ బీమా ,ప్రతి ఫోటోగ్రాఫర్ కు ప్రభుత్వ గుర్తింపు



వంగూరులో..



కొల్లాపూర్‌లో..

కార్డు కావాలనే తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం లైఫ్ మెంబర్ కట్టా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ తాలూకా ప్రెసిడెంట్ షబ్బీర్, మహబూబ్, ఫోటోగ్రాఫర్లు తాజొద్దీన్, శేఖర్, ఖయ్యూం, మక్కా, చందు, మోసిన్, శ్రీనివాసులు, భవాని, మూర్తి, ఆసిఫ్, సంతోష్, రైముద్దీన్, కుటుంబ భరోసా ఇంచార్జ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలకపల్లి మండల ఫోటో వీడియో గ్రాఫి అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఇటీవల అచ్చంపేట ఫోటోగ్రాఫర్ రఘు భార్య మరణించడంతో వారి కుటుంబానికి సోమవారం మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ తరపున 7100 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కొల్లాపూర్ చౌరస్తాలో గల జ్ఞాన మందిరం అనాధ బాలికల ఆశ్ర మానికి 2200 రూపాయలు ఆర్థిక సాయం అందజేసినట్లు మండల ఫోటోగ్రఫీ అండ్ వీడియో గ్రాఫి సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసిన మండల కమిటీకి బాధిత కుటుంబ సభ్యులు మరియు ఆశ్రమ పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాఖీ పండుగ



కల్వకుర్తిలో..

నవతెలంగాణ -కల్వకుర్తి

కల్వకుర్తి మండలం తో పాటు పట్టణంలో రాఖీ పండుగ వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ పండుగను ప్రతి ఏడాది ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన సోదరి రామేశ్వరమ్మ హైదరాబాదులోని ఆయన స్వగృహంలో రాఖీ కట్టారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళల రక్షణ కోసం కృషి చేస్తానని చెప్పారు. మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని కోరారు. రాఖీ పండుగ వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఎంతో ఘనంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. అనంతరం మహిళలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

తెలకపల్లి : మండల కేంద్రంలో పరిసర గ్రామాల్లో సోమవారం రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు అక్క చెల్లెలు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు "నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష అంటూ" పుట్టింటివారు ఎల్లప్పుడూ తమకు రక్షణగా ఉండాలని కోరుతూ ఆత్మీయతను చాటుకున్నారు.

జడ్చర్ల: స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్ లో జడ్చర్ల మహిళా విభాగం ఆధ్వర్యంలో వృక్ష



తెలకపల్లిలో..

రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.తోబుట్టువులు ఒకరికొకరు రక్షణగా ఉండాలని ఉద్దేశ్యంతో రక్షాబంధన్ పండుగను జరుపుకుంటారు.అదేవిధంగా పర్యావరణం సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని మహిళా విభాగం కార్యకర్తలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణం పట్ల చైతన్యం కలుగజేస్తాయని గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య భాగ్య శ్రీ,శ్యామిలి, ఉమన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలామణి, రామకృష్ణ పాల్గొన్నారు.



జడ్చర్లలో..

నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

నవతెలంగాణ- వనపర్తి రూరల్

తెలంగాణ సమగ్ర శిక్ష హైదరాబాద్ వారు ఈనెల 20 మంగళవారం రోజున వనపర్తి జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రము మండల వనరుల కేంద్రం కేటీఆర్ నగర్ వనపర్తి నందు దివ్యంగా విద్యార్థుల ఉపకరణాల గుర్తింపు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు దివ్యాంగ విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలను గుర్తించి వారికి ఉచితంగా ఉపకారణాలను అందజేస్తున్నారని తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్ ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా రేషన్ కార్డు జిరాక్స్ 40 శాతం కన్నా ఎక్కువగా ఉన్న సదరన్ సర్టిఫికెట్ సదరం సర్టిఫికెట్ లేనివార ప్రభుత్వ వైద్యుని దగ్గర సర్టిఫికెట్ పొంది, దానిపైన మండల నోడల్ లేదా ప్రధాన ఉపాధ్యాయుల ద్వారా ధృవీకరించి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా రెండు పాస్‌ఫోటోలు, సైజ్ ఫోటోలు వైకల్యం కనిపించే విధంగా ఉండాలన్నారు.18 సంవత్సరాల వయసు లోపు గల దివ్యంగుల విద్యార్థులు అర్హులని పెర్కొన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం అక్కడే ఏర్పాటు చేశామన్నారు. దివ్యంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు లేదా సంరక్షకులకు సరైన రుజువులు చూపించిన పిదప బస్సు ఛార్జీలు కూడా చెల్లించ బడునని తెలిపారు. ఈ యొక్క శిబిరానికి ఐఆర్పిలు తమ మండల సిడబ్ల్యూ ఎస్ఎన్, పేరెంట్స్ ని ఎనిమిది గంటల 30 నిమిషాల లోపు హాజరయ్యేటట్లు చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు.

బాధితులకు మొబైల్ ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ- జడ్చర్ల

జడ్చర్ల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ గారి ఆదేశాల మేరకు జడ్చర్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వ్యక్తుల యొక్క సమాచారం ప్రకారం CEIRను ఉపయోగించి 25 ఫోన్లను ట్రేస్ చేశామని మహబూబ్‌నగర్ డీఎస్పీ శ్రీ వెంకటేశ్వర్లు అన్నారు. ఫోన్లను పోగొట్టుకున్న సంబంధిత వ్యక్తులకు ఫోన్లను అందజేశారు. ఇప్పటివరకు 300 ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. డీఎస్పీ వేంకటేశ్వర్లు ఎస్ హెచ్ ఓ ఆదిరెడ్డి నీ ,సిబందిని డీఎస్పీ అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నారాయణపేట
మంగళవారం ఆగస్టు 20, 2024 www.navatelangana.com

నర్వలో భారీ వర్షం

- ఇబ్బందుల్లో పాదచారులు, వాహనదారులు
- రోడ్లన్నీ జలమయం




నవ తెలంగాణ - నర్వ

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్న ఎండలు, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. సోమవారం మధ్యాహ్నం నారాయణపేట జిల్లా నర్వ మండలకేంద్రంతో పాటు మండలంలోని రాయికోడు, పాతర్ చెడు, యాంకి, లంకాల, రాంపూర్, రాజు పల్లి, సిపూర్, కల్వాల్, తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జక్కన్న పల్లి, లక్కర్ దొడ్డి, కొత్తపల్లి గ్రామాల రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై ఉన్న గుంతల్లోకి వర్షపునీరు చేరడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఉదయం నుంచి ఎండతో ఇబ్బందులు పడిన ప్రజలకు మధ్యాహ్నం కురిసిన వర్షం ఎంతో ఉపశమనం కలిగింది. గంట పాటు ఎడతెరిపీ లేకుండా కురిసిన వర్షానికి వాగులు పొంగి పొర్లడంతో చెరువుల్లోకి భారీగా నీరు చేరాయి. జక్కన్న పల్లి గ్రామ ప్రజలు నర్వ మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్లే దారి పై నీరు ప్రోవహిస్తుండడంతో నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఆటోలు, బైకులు సైతం నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగును దాటేందుకు ఒకరికొకరు పట్టుకొని దాటారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయించి గ్రామ ప్రజల ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరుతడి పంటలకు ఊరట..

ఒక్కసారిగా వాతావరణంలో ఏర్పడిన కారణంగా మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈఏడాది వర్షాకాలం సీజన్‌లో రెండవ సారి ఇంత పెద్ద వర్షం కురువడంతో వ్యవసాయానికి బాగా ఉపయోగపడుతుంది. పత్తి పంటకు జీవం పోయగా వేరే ఇతర పంటల సాగు కోసం ఈ వర్షం చాలా లాభదాయకమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ వర్షంతో చెరువులు, కుంటల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. కొన్ని రోజులుగా వర్షాలు లేక వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం కాగా సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి చిన్న చెరువులు, కుంటల లోకి వరద నీరు చేరింది.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- మొహమ్మద్ కుర్షిత్ సాబ్ షాకీర్ ఖాన్, మహమ్మద్ ఇస్మాయిల్



నవ తెలంగాణ - ఊట్కూర్

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మొహమ్మద్ కుర్షిత్ సాబ్ షాకీర్ ఖాన్, మహమ్మద్ ఇస్మాయిల్ అన్నారు. మహమ్మద్ యూసుఫ్ మెమోరియల్ అండ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ నారాయణపేట జిల్లా వారి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఊట్కూర్‌లోని మిల్లత్ ఇస్లామియా హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు , సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా విని చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ వార్డ్ మెంబర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి (మాజీ వార్డ్ మెంబర్)ఇస్మాయిల్ ఉపాధ్యాయుల బృందం , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న..
అఘాయిత్యాలను అరికట్టాలి : పీడీఎస్‌యూ



నవతెలంగాణ - నారాయణపేట

కలకత్తాలో వైద్య విద్యార్థి శిక్షణ పొందుతున్న డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పీ.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సాయికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. రాత్రి మొత్తం విధులు నిర్వహించి రెస్ట్ తీసుకుందని సెమినార్ హల్ కు వెళ్లిన డాక్టర్‌ను ఒక్కతే ఉన్నదని అదునుగా భావించిన దుండగులు ఆమెపై అత్యాచారం చేసి ఇనుప రాడ్లతో దాడి చేసి హత్య చేయడం క్షమించరానిది అని అన్నారు. ట్రైనీ డాక్టర్ పై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, శ్రీహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, జిల్లా సహాయ కార్యదర్శి గౌస్, వెంకటేష్, జిల్లా నాయకులు విజయ్ కుమార్, శేఖర్ తోపాటు మిగతా సభ్యులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న



నవతెలంగాణ - మక్తల్

కోల్కత్తా నగరం నడిబొడ్డున ఉన్న ఆసియా ఖండ తొలి వైద్య కళాశాల ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మౌమిత ను అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీ, శ్రామిక మహిళా యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డాక్టర్ మౌమిత సంఘీభావ ప్రదర్శన చేసి డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం తలదించుకునేలా డాక్టర్ మౌమితపై అత్యాచారం చేసిన వారిలో పెద్దల హస్తం ఉన్నట్టు , ఆ హాస్పిటల్లో అనైతిక కార్యకలాపాలతో పాటు అనధికార ఆర్గాన్ వ్యాపారం, సెక్స్ రాకెట్ సైతం జరుగుతున్నట్టుగా దేశవ్యాప్త ఆరోపణలు వస్తున్నాయని , ఈ అరాచకాలను ప్రశ్నించినందుకే డాక్టర్ మౌమితను హత్య చేసినట్లు దేశం భావిస్తుందని ఆరో పించారు. డాక్టర్ మౌమిత హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని పౌర సేవ కానిస్టేబుల్ సంజయ్‌తో పాటు బాధ్యులందరినీ అరెస్టు చేసి ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ కేంద్ర రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు సంతోష్ , ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, శివ, శ్రామిక మహిళా యూనియన్ ఏఐటీయూసీ నాయకులు సరోజమ్మ , నారాయణమ్మ , నర్సమ్మ , పద్మమ్మ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్



నవ తెలంగాణ - నారాయణపేట

ప్రజావాణి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్త పట్నాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందినవారు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అశోక్ కుమార్ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి : కలెక్టర్

నవతెలంగాణ - నారాయణపేట

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్ జాబితాలో చోటు కల్పిస్తూ సర్వే చేయాలని బూతు లెవల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్ అదనపు కలెక్టర్లు మయాంకు మిత్తల్, అశోక్ కుమార్, తో కలిసి తహసీల్దారుల ట్రైనింగ్‌లో బీ.ఎల్.ఓ ల ముఖ్య పాత్ర ముఖ్యమన్నారు. జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటర్ జాబితా సవరణ 2025 కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయదా ఓటరు జాబితా విడుదల చేయాలని, నవంబర్ 28, 2024 వరకు సదరు జాబితా పై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని అన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18, 2024 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ధృవీకరణ చేపట్టాలని, ఓటర్ జాబితాలో అవసరమైన చోట పాత ఫోటోలను తొలగించి ఓటర్ల నూతన ఫోటోలు అప్లోడ్ చేయాలని అన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్స రాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు 100 శాతం వెరిఫికేషన్ , పోలింగ్ స్టేషన్ మార్పు అవసరం ఉంటే చేయాలన్నారు. అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 28 వరకు జనవరి ఒకటి 2025 ప్రామాణికంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తూ ముసాయిదా జాబితాన్ని రూపొందించాలని అన్నారు. మరణించిన ఓటర్ల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటర్ జాబితా నుంచి ఫారం 7 ద్వారా తొలగించాలని అన్నారు. ఫారం 6, 6ఏ, 6 బి గురించి వివరించారు. ఓటర్ జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, అదేవిధంగా ఓటర్ కార్డు పై ఉన్న పొరపాట్లు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.





ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి..

ప్రజలకు మెరుగైన సేవలు అందించినపుడే ప్రజలలో డాక్టర్ల పై నమ్మకం కలుగుతుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం జిల్లా ఆసుపత్రినీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్లు విధులకు సమయానికి చేరుకోవాలనీ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీ లించి అక్కడున్న రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న డైట్ సమయానికి చేరుతుందా లేదా రోగులకు అల్పాహారం అందిస్తున్నారా లేదా అనేవిషయన్ని అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న ఓ పాపను అప్యాయంగా పలకరించారు. రోజు వారి ఓపి ఏంత ఉంటుందని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రక్త నిల్వ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు కనుక్కున్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 263 వైరల్ ఫీవర్ కేసులు నమోదయ్యాయని, డెంగ్యూ కేసులు 8 నమోదై కోలుకొని డిశ్చార్జ్ అయ్యారన్నారు. సోమవారం డైట్‌లో ఉప్మా అందించామన్నారు. రోజు ఓపి 800 మందిని చూడటం జరుగుతుందన్నారు. రక్తం నిల్వ వివరాలు ఈ రక్త పోష్ యాప్ లో నమోదు చేస్తునామనీ 20 యూనిట్ల రక్తం నిల్వ ఉందన్నారు. అనంతరం డాక్టర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈవీఎం గోదాంలను పరిశీలన

ఈవీఎంల భద్రత కట్టుదిట్టంగా ఉండాలని కలెక్టర్ సిక్త పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నారాయణపేట లోని ఈవీఎం గోదాములను సందర్శించి భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ఈవీఎం గోదాంల దగ్గర గట్టి భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పూజారిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలి

- ప్రజా సంఘాల నాయకులు



నవతెలంగాణ - కృష్ణా

దళితుల పెళ్లిని అవమానించి గుడిలోకి రానివ్వకుండా అడ్డుకున్న ప్రభుత్వ ఉద్యోగి చక్రపాణి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. సోమవారం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్ గ్రామంలో ఆదివారం గ్రామంలో జరిగిన దళితుల ఓబులేష్, పద్మ దంపతుల పెళ్లిని అడ్డుకొని గుడి లోపలకి రానివ్వకుండా వస్తే మైల పడుతుందని, గుడి బయటనే పెళ్లి చేసుకుని దళితుల నిరసనతో వెనుతిరిగారని నవ తెలంగాణ పత్రికతో పాటు తదితర పత్రికల్లో వార్త ప్రచురితమైంది. ఇందుకు సోమ వారం దళిత ప్రజా సంఘలా నాయకులు స్పందించి ముడుమల్ గ్రామంలో ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగై , దేవాలయ జీత బత్యాలు పొందుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతూ అంటరానితనం పోషిస్తున్న చక్రపాణిని ఉద్యోగం నుంచి తొలగించాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవుళ్ళ పేరు మీద ఉన్న భూములను అనుభవిస్తూ అక్రమ సొమ్ము సంపాదించుకున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. మంత్రాలయ పీఠాధిపతి కార్యదర్శి ఈ నిరసనకు హాజరై మాట్లాడుతూ యాదవేంద్ర స్వామి ఆల యంలో అన్ని వర్గాలకు దర్శనం పెళ్లిళ్ల చేసుకు నేందుకు మంత్రాలయ పీఠాధిపతి నుంచి ఎలాంటి అభ్యంతరం తెలుపలేదని ఎవరైనా చేసుకోవచ్చని మంత్రాలయ పీఠాధిపతి కార్యదర్శి తెలిపారు. అనంతరం దళిత సంఘాలు గ్రామంలో ఆం దోళన చేస్తూ అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ చక్ర పాణిపై కేసు నమోదు చేయాలని, లేనిచో రాబోయే రోజుల్లో ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేప డ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.పీ, ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.కృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగేష్, కళ్యాణ్, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, బీఎస్పీ నాయ కులు మహాదేవ్ నరసింహ, టీఎస్ ఎమ్మార్పీ ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుప్పల్లి వెంకటేష్ మాదిగ, మాగనూరు హిందూపూర్ అంబేద్కర్ సంఘ నాయకులు రమేష్, అనిల్ , గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు మరికల్‌లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - మరికల్

నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం మరికల్ తెలంగాణ చౌరస్తా నిర్వహించడం జరు గుతుందని మరికల్ మండల పట్టణ అధ్యక్షులు హరీష్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉదయం11గంటలకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి, జన్మదిన కార్యక్రమం, బైక్ ర్యాలీ, అనంతరం కేక్ కటింగ్, ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద నిర్వహించడం జరుగుతుందని తెలి పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, మరికల్ మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , యువకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇసుకను పంపిణీ చేయాలి : నరహరి



నవతెలంగాణ - మరికల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పంపిణీ పథకాన్ని వెంటనే చేప ట్టాలని మరికల్ మండల ఇసుక ట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు రాకొండ వైన్స్ నరహరి తెలిపారు. సోమవారం మరికల్ మండల కేంద్రంలో విలేకరులతో ఆ యన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రజలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక దొరకకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని వెంటనే చేపట్టాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు



నవతెలంగాణ - నారాయణపేట

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ సావర్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనదారులు మద్యంతాగి వాహనాలు నడపరాదని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరి మానాతో పాటు జైలుకు పంపించడం జరుగు తుందన్నారు. మద్యం తాగడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉన్నాయని, వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనదారులు మెయిన్ రోడ్డు పై వాహనాలను పార్కు చేయరాదన్నారు. టూ వీలర్స్ పై ఇద్దరకు మించి ప్రయాణించరాదని, ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను ,కూలీలను ఎక్కించు కోరాదన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడ రాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, పరిమిత వేగంలో వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు గోవింద్ రెడ్డి, వాహనదారులు తది తరులు పాల్గొన్నారు.

రక్తదానం ..



నవ తెలంగాణ - నారాయణ పేట

జిల్లా కేంద్రానికి చెందిన శంకరప్ప అనారోగ్యంతో ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల కోసం అడ్మిట్ అయ్యాడు. డాక్టర్లు పరీక్షించి ఆయనకి B-ve బ్లడ్ కావాలని తెలపడంతో అరుదుగా దొరికే బీ.వి రక్తం నిల్వ ఎక్కడ ఉంటాయని కుటుంబ సభ్యులు సతమతమయ్యారు. ఈ విషయం నారాయణపేట జిల్లా యువశక్తి ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి పవన్‌తో రక్తదానం చేయి ంచారు. నారాయణపేట జిల్లాకు సంబంధించి ఎంతోమందికి యువశక్తి ఫౌం డేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు జిల్లా ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ ప్రవీణ్, డైరెక్టర్ గణేష్, ఆకాష్, లక్ష్మణ్ మిగతా సభ్యులు పాల్గొన్నారు.

నువ్వు నాకు రక్షా.. నేను నీకు రక్షా..



నవ తెలంగాణ - నర్వ / ఊట్కూర్

నర్వ, ఊట్కూర్ మండలాల వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేను నీకు రక్ష......నువ్వు నాకు రక్ష....అంటూ అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్ల రాఖీలు కట్టారు. హిందు సంప్రదాయ పండుగల్లో అన్నా,చెల్లెళ్లు...అక్కా, తమ్ముళ్ల ప్రేమానురాగాలను చాటిచెప్పేది ఒక్క రాఖీ పండుగే. శ్రావణ మాసంలో వచ్చే పూర్ణిమను "శ్రావణ పూర్ణిమ" అంటారు.దీన్నే 'రాఖీ' లేఖ 'రక్షా బంధన్' పండుగగా పిలుస్తూ ఉంటారు. ఒకప్పుడు ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో వైభవంగా జరుపుకునే ఈ పండుగను ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.పండుగ రోజు,అన్నాచెల్లెలు అక్కా తమ్ము డు ఇలా చిన్నా పెద్ద తారతామ్యం లేకుండా తమ ఆప్యాయతలను పంచుకుంటారు. రాఖీని కట్టుకున్న సోదరులు కానుకలతో తమ ప్రేమను చాటుతారు. ఆయా చోట్ల ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులకు సోదరీమణులు, ఆయా శాఖల సిబ్బంది, మహిళా నాయకులు రాఖీలు కట్టారు. పాఠశాలల్లో విద్యార్థులు ఒకరికొకరు కట్టుకొని, స్వీట్లు తినిపించుకున్నారు.





మక్తల్ : భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీల ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శ్రామిక మహిళ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్‌లు మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ల అను బంధ రక్షాబంధన్ సాంప్ర దాయ పండుగను భారతదేశంలో జరుపుకోవడం అనాధిగా వస్తున్నదని పేర్కొన్నారు.

టీవీఎస్ ఎక్సెల్ చోరీకి విఫలయత్నం

నవ తెలంగాణ - ఊట్కూర్

ఇంటిముందున్న టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని అపహరించేందుకు ప్రయత్నించిన సంఘటన మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో టైలర్ నారాయణ ఇంటి ముందు చెట్టు కింద టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని రోజు మాదిరిగా నిలిపారు. సోమవారం రాత్రి దాదాపు రెండు గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు (దొంగలు) టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని అపహరించేందుకు ప్రయత్నించే క్రమంలో చుట్టుపక్కల వారు (మేల్కొని)అప్రమత్తం కావడంతో (దొంగలు) గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని పడేసి వెళ్లిపోయారు. దీంతో వాహనం కొద్దిగా డ్యామేజ్ అయినట్లు పేర్కొన్నారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

జోగులాంబ-గద్వాల

మంగళవారం | ఆగస్టు 20, 2024 | www.navatelangana.com

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ బీ. ఎం. సంతోష్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బీ.ఎం. సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐ డీ ఓ సీ సమావేశం హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని అన్నారు. లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 18 ఫిర్యాదులు అందాయని, వచ్చిన దరకాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస రావు ,ఆర్ డీ ఓ రామ్‌చందర్ , వివిధ శాఖ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో ప్రసవం

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల



ఆర్టీసీ బస్సులో పండండి ఆడ శిశువుకు జన్మనిచ్చిన సంఘటన సోమ వారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గద్వాల నుంచి వనపర్తికి వెళ్లే పల్లెవెలుగు బస్సులో వనపర్తికి 15 కిలోమీటర్ల దూరంలోని నాసినల్లి గ్రామం వద్ద సంధ్య ప్రసవించింది. పల్లెవెలుగు బస్సు నెంబర్ 25 43లో ప్రయాణిస్తున్న గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన సంధ్యకు పురిటి నొప్పులు రాగా కండక్టర్ జీ. భారతి ఈ 153073 వెంటనే ఈ విష యాన్ని డిపో మేనేజర్‌కి దృష్టికి తీసుకువెళ్లింది. వెంటనే డిపో మేనేజర్ సూ చనల ప్రకారం బస్సు నిలిపి బస్సులో ఎవరైనా ట్రీట్మెంట్ తెలిసిన వారు ఉన్నారా అని కనుక్కొని.. ఒక సిస్టర్ ఉందని తెలుసుకొని ఆమె సహాయంతో మగవారిని బస్సు నుంచి దింపేసి బస్సులోనే ఆమెకు డెలివరీ చేయగా పాప పుట్టింది. తల్లి కూతుళ్లిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. అనంతరం కండక్టర్ 108కి ఫోన్ చేసి అంబులెన్స్ సిబ్బంది వచ్చి తల్లీబిడ్డలను వనపర్తి హాస్పిటల్‌కి తరలించారు. మహిళా కండక్టర్ చేసిన సహాయాన్ని ప్రయాణికులు, గ్రామ స్తులు, ఆర్టీసీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టళ్లను..
అప్‌గ్రేడ్ చేయాలని వినతి



నవతెలంగాణ - గట్టు

ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టళ్లను అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షులు కొమ్ముల ప్రవీణ్ రాజ్ డీఎస్సీడీఓ సరోజినీకి సోమవారం వినతి పత్రం అందజేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో టెన్త్ క్లాస్ వరకే ఉండడంతో జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న మండలాలలో విద్యార్థులు ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో చాలామంది పేద విద్యార్థులకు కాలేజీలకు వెళ్లకుండా చదువు మధ్యలో మానేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్సీ హాస్టల్స్ ఉన్నచోట గట్టు మల్దకల్, అయిజ, మనపాడు, ఉండవల్లి, అలంపూర్, వడ్డేపల్లిలోని ఇంటర్ కాలేజ్ , డిగ్రీ కాలేజ్ ఉన్నచోట ఆ విద్యార్థులకు ఎస్సీ సంక్షేమ హాస్టల్స్‌లో ఉండి చదువుకోవడానికి ఎస్సీ హాస్టల్స్‌లను ఇంటర్మీడియట్ ఉన్నచోట ఇంటర్మీడియట్ వరకు , డిగ్రీ కళాశాల ఉన్నచోట డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గట్టు మండలానికి తక్షణమే డిగ్రీ వరకు ఎస్సీ హాస్టల్‌ను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్యార్థులకు తక్షణమే ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్లో అవకాశం కల్పించాలని కోరారు. మల్దకల్, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో డిగ్రీ వరకు అప్ గ్రేడింగ్ చేయాలని వినతిలో పేర్కొన్నారు.

ఏఈఓకు ఘన సన్మానం



నవతెలంగాణ - ధరూర్

మండలంలోని నీలహళ్లి క్లస్టర్‌లో గత ఎనిమిది సంవత్సరాలుగా వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేసిన నరసింహను నిలహళ్లి గ్రామ రైతులు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి బదిలీ అయ్యారు. నిలహళ్లి గ్రామ రైతులు ఏఈఓ నరసింహాకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఆయన్ని ఘనంగా సన్మనించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్లడం సర్వ సాధారణమని నీలహళ్లి గ్రామా రైతులు తనను ఒక అధికారిగా కాకుండా ప్రతి ఇంటిలో తమ బిడ్డగా భావించి చూసుకున్నారని, ఇలాంటి క్లస్టర్ ను విడిచి బదిలీ పై వెళు తున్నందుకు తనకు బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మాట్లా డుతూ నిత్యం వ్యవసాయ అభివృద్ధి రైతుల సంక్షేమం కోసమే పనిచేసిన వ్యక్తి ఏఈఓ నరసింహ అని, ఇలాంటి అధికారి తమ క్లస్టర్ నుంచి బదిలీ అవు తున్నారని తెలుసుకున్న రైతులు బావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్ర మంలో ఆయా గ్రామాల ప్రజలు, యువత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి

నవతెలంగాణ - గట్టు



పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఆరగిద్ద గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం మేరకు వివ రాలు ఇలా ఉన్నాయి.. గ్రా మానికి చెందిన నల్ల రెడ్డి (32) తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుం టుండగా ఆకస్మికంగా మెరుపు మెరిసి పిడుగు పాటుకు గురై మృతి చెందినట్ల గ్రామస్తులు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు వారు తెలిపారు. రాఖీ పండుగ రోజు పిడుగుపాటుకు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఆలయాలను దర్శించుకున్న పోలీస్ కమిషనర్

నవ తెలంగాణ - అలంపూర్



జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాలను హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి పురేందర్ కుమార్, ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట సీఐ రవిబాబు, ఎస్సై నాగరాజు ఉన్నారు.

జోగులాంబ దేవికి కానుకగా బంగారు ముక్కెర..

అష్టాదశ శక్తి పీఠాలు ఒకటైన 5వ శక్తి పీఠం జోగులాంబ దేవికి హైదరాబాద్ వాస్తవ్యులు సురేష్, అంజనీ దేవి దంపతులు 5 గ్రాముల బంగారు ముక్కెరను కానుకగా సమర్పించారు. ముక్కెరను ఆలయ కార్యనిర్వాహణాధికారి పురేందర్ కుమార్ కు అందజేశారు.

ఘనంగా రక్షాబంధన్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

రాఖీ పౌర్ణమి సందర్భంగా బాల సదనం పిల్లలు బేటీ బచావో, బేటీ పడవో పేరు మీద తయారు చేసిన ప్రత్యేక సురక్షాబంధన్ రాఖీలను కలెక్టర్ బీ.ఎం. సంతోష్ కు రాఖీ కట్టారు. సోమవారం క్యాంప్ కార్యాల యంలో బాల సదనం పిల్లలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు చూపించిన ప్రేమ, ఆప్యాయత నాకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. వారితో కలిసి ఈ పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అలాగే, బాల సదనం పిల్లల చదువు, ఆరోగ్యం కొరకు ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్స్ పంపిణీ చేశారు. చివర్లో పిల్లలు కలెక్టర్‌తో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, డీసీపీఓ నరసింహ, సూపరింటెండెంట్ సుధారాణి, బాలసదనం సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో ..

గద్వాల జిల్లా కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిరహించారు. అందులో భాగంగా డీఎస్పీకి ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ నర్మద రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిరోజు నిజ జీవితంలో మనం అనేక సమస్యల మీద మాట్లాడుతుంటాము అట్లానే ఈరోజు అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల బంధం ఈ ఒక్క రోజుకే పరిమితం కాకుండా ప్రతిరోజు సమాజంలో అనేక మంది అక్కచెల్లెళ్ల మీద చెప్పలేనని విపత్కారాలు జరుగుతున్నాయని, అలాంటి సందర్భంలో అన్యాయానికి గురైన ప్రతి ఆడపిల్లకు మీరు ఒక అన్నగా ఒక తమ్ముడిగా స్పందిస్తూ అనేకమంది ఆడపిల్లలను కాపాడటంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పవిత్ర, రజిత పాల్గొన్నారు.

నవతెలంగాణ- ధరూర్

రాఖీ పౌర్ణమి సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు సరిత క్యాంప్ కార్యాలయంలో పట్టణ, వివిధ మండల, గ్రామాల కాంగ్రెస్ నాయకులకు మాజీ జెడ్పీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జీ సరిత రాఖీ కట్టి, స్వీట్లు పంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సోదరుల ఆశీర్వాదంతో అన్నా చెల్లెలు, అక్కతమ్ముల అనుబంధాలు, ప్రేమాప్యాతలు ఎప్పటికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గట్టు

మండలం కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో సోమవారం రాఖీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇండ్లలోని అన్నాచెల్లెళ్లకు అక్కతమ్ముళ్లకు రాఖీ పండుగ సందర్భంగా వారి చేతికి రాఖీ కట్టి నీకు నేను రక్షా.. నాకు నువ్వు రక్షా అని , ఎప్పటికీ ఇలాగనే అన్న చెల్లెలుగా అక్క తమ్ముడిగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

నవ తెలంగాణ - అలంపూర్

అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సొం తంగా తయారు చేసిన రాఖీలు సోదరులకు కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పీ.నాగలక్ష్మి మాట్లా డుతూ రాఖీ పండుగ అనేది మన భారతీయ సంప్రదా యంలో సోదరుడు, సోదరి మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరచడానికి చేసే పండుగని, పిల్లలు ఇలాంటి పండుగలను జరుపుకోవడం వల్ల వారికి మన సంప్రదా యాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. తరగతి గదుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, రాఖీలను ఎలా తయారు చేయాలో విద్యార్థులకు వివరించారు. రాఖీ కట్టిన త ర్వాత, విద్యార్థులు తమ సోదరులకు స్వీట్లు పంచు కున్నారు. చివరిగా బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్ కే.ఎస్.వి. రవి ప్రకాశ్ విద్యార్థిని విద్యార్థులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



జోగులాంబ గద్వాలలో..



ధరూర్‌లో..



గట్టులో..



అలంపూర్‌లో..

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

నవతెలంగాణ - ధరూర్

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ధరూర్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ తోటి ఫోటోగ్రాఫర్లతో కలిసి మండల కేంద్రంలో డాగురే లూయిస్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిక్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించేది, కాల గర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేదే ఫోటో గ్రఫీ అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా, మండల ఫోటో గ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గద్వాలకాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సరిత తిరుపతయ్య ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ ఫోటో , వీడియో గ్రాఫర్ అసోసియేషన్ మండల కోశాధికారి శ్యామ్,ప్రధాన కార్యదర్శి రమేష్,జిల్లా మీడియా ఇంచార్జీ గోవింద్,ఫోటో గ్రాఫర్లు రాజు,వెంకటేష్, జయరామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వీరభద్రేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ - గట్టు /ధరూర్

మండలంలోని ఇందువాసి గ్రామంలో వీరభద్రేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన, నూతన దేవాలయ ప్రారంభోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా టీఆర్ఎస్ నాయకులు హనుమంతు నాయుడు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు బాసు హనుమంతు నాయుడును శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే ధరూరు మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర రెడ్డి వీరభద్రేశ్వర స్వామి నూతన దేవాలయ ప్రారంభోత్సవ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటిసి పద్మావెంకటేశ్వర రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ , బస్వరాజు గౌడ్, మాజీ సర్పంచ్ వీరేష్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, అంగడి బస్వరాజు, ఎస్ రాము, రాజు నాయుడు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, బాసు బొజ్జయ్య, తిమ్మప్ప, గట్టు సాయి కుమార్, రామన్ గౌడ్, జామన్న, తుమ్మలపల్లి రాజు, గురుపద నాయుడు, మేకల తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





పీడీఎస్‌యూ..
గ్రామ కమిటీ ఎన్నిక

నవ తెలంగాణ - ఉట్కూర్

మండలంలోని అవుసలోనిపల్లి గ్రామంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఐ ఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. కిరణ్ , పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ. భాస్కర్ పాల్గొని పీడీఎస్‌యూ గ్రామ కమిటీని ఎన్ను కున్నారు. గ్రామ అధ్యక్షులుగా ఎన్. శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి జోగు పరుశరామ్ ఉపా ధ్యక్షులుగా అరవింద్, సాగర్ సహాయ కార్యదర్శి కృష్ణ, నందిని కోశాధికారి శివ 9 మందిని సభ్యులుగా ఎన్ను కున్నారు.






ఘనంగా మార్కండేయస్వామి పల్లకీ సేవ

మరికల్ : శ్రావణ మాసంలో నిర్వహించే రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాలీ కుల సంఘం ఆధ్వర్యంలో మరికల్‌లో సోమవారం మార్కండేయ పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. గ్రామ పుర వీధుల గుండా మార్కండేయ పల్లకీని భుజాలపై ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహి ంచుకుంటూ నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి దేవాల యంలో మార్కండేయ గుడి వద్ద మార్కండేయ పున్నమి (నూలు పున్నమి) సంద ర్భంగా పద్మశాలి కుల బంధువులందరూ యజ్ఞోపవీతాన్ని ధరించారు. ఈ కార్యక్ర మంలో పద్మశాలి సంగం పట్టణ అధ్యక్షుడు గోరింట్ల వెంకటేష్, పద్మ శాలి సం ఘం నాయకులు మేకల సుదర్శన్, కర్లీ కష్టయ్య ,సదన్ రావు, బాల రాజ్, శ్రీకాంత్, కుమార్, పాండు, రాజు, నిఖిల్, నరేష్, గోపి, రామ్మోహన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ పత్తి

- స్వల్పంగా పెరిగిన వరద నీరు
- ఇన్ ఫ్లో 48వేల 500లు, ఔట్ ఫ్లో 43 వేల 221



నవతెలంగాణ - ధరూరు

జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి 48500 వేల క్యూసెక్కుల నీరు రావడంతో సోమవారం అధికారుల సమాచారం మేరకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఆరు యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. ఎగువ ప్రాంతం నుంచి 48500 వేలక్యూసెక్కుల నీరు జూరాలకు వచ్చి చేరుతోంది. దీంతో జూరాలలో ఆరు యూనిట్ ద్వారా 37 వ వేల1907 క్యూసెక్కుల నీరు జల విద్యుత్ కేంద్రం ద్వారా శ్రీశైలం జలాశంలోనికి వదులుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జూరాల నీటిమట్టం 318. 516 నీటిమట్టం ఉన్నట్టు తెలిపారు.నెట్టెం పాడుకు 750 కోయిల సాగర్ కు 315 ఎడమ కాలువకు 920 కుడికాలువకు 735 పానెల్ కాలువకు 500 బీమా టు 750 తీసుకుందిరను కాలువల ద్వారా వదులు తున్నారు. మొత్తం మీద జూరాల ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతాలకు 43వేల 221 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

ధరూర్‌లో భారీ వర్షం



నవతెలంగాణ - ధరూరు

జోగులంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు . గత పది రోజులు ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు, రైతులు వర్షం కురియడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ వర్షం పంట పొలాలకు ఊపిరి పోసిందని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పని చేయించుకొని.. మోసం చేసిన
యజమానిపై చర్యలు తీసుకోవాలి

మల్దకల్ : నిరుపేదలతో పని చేయించుకొని.. మోసం చేసిన యజమాని , మేస్త్రీలపై తగు చర్యలు తీసుకోవాలని కూలీలు రాజానందం, ప్రభాకర్, అడ్డాకుల ప్రభాకర్, తిమ్మప్ప, కోతపాలెం కృష్ణా, లాలాన్నలు కోరారు. సోమవారం నవ తెలంగాణతో వారు మాట్లాడుతూ మండలంలోని నాగర్ దొడ్డి గ్రామానికి చెందిన దుబ్బ రాజు, చింతల్ తిమ్మప్పలు ఇటుక లేబర్‌లను మోసం చేశా ‌రన్నారు. అచ్చంపేటకు చెందిన అంతటి మల్లేష్ యజమాని ఇటుక పని చేయిం చుకొని లేబర్‌లకు డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు గురిచే స్తున్న ట్లు ఆవే దన వ్యక్తం చేశారు. దాదాపు ఏడు నెలల పాటు కష్టం చేసినప్పటికీ డ బ్బుల ఇవ్వకుండా మమ్మల్ని నానా విధాలుగా ఇబ్బందులకు గురి చేసు న్నారని వాపోయారు. ఈ విషయమై వెంటనే లేబర్ అధికారులు స్పందించి తమ డబ్బులు ఇప్పించి తమకు న్యాయం చేయాలని కోరారు.

